


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 14 ఆగస్టు 2025 పేజీలు 8


# స్వర్ణాంధ్ర నిర్మాణానికి ప్రగతి సూచికలే పునాదులు




- నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- 2025-26లో జిల్లా జీడీపీ లక్ష్యం రూ. 1,12,057 కోట్లు
- ప్రతి రంగంలోనూ వృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేయాలి
- పీ4 అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలపాలి
- ఘన వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకే విజయవాడ ఉత్సవ్
- అధికారులతో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13, మేజర్ న్యూస్ :** సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర.. స్వర్ణాంధ్ర నిర్మాణానికి కీలక ప్రగతి సూచికలే (కేపీఐ) పునాదులని.. నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అన్ని రంగాల్లోనూ వృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్‌లోని రైతు శిక్షణ కేంద్రంలో ఎన్‌టీఆర్ జిల్లా మూడో సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), 2



కుండపోత వర్షానికి

# నీటమునిగిన పొలాలు

- చెరువులను తలపించేలా పంటచేలు
- మెట్ట పంటలకూ వర్షం ముప్పు, నేలవాలిన అరటిచెట్లు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కుండపోత వర్షానికి చల్లపల్లి మండలంలో పంటపొలాలు నీటిమునిగాయి. చెరువులను తలపించేలా పంటచేలల్లో వర్షపునీరు చేరగా, పలుచోట్ల మురుగుకాల్వలు.. పంటచేలు ఒక్కటిగా మారాయి. చల్లపల్లి మండలం వక్కలగడ్డ, మేకావారిపాలెం, లంకతోటరోడ్డు, పాగోలు, మంగళాపురం, పాతమాజేరు, చింతలమడ, చల్లపల్లి తదితర గ్రామాల్లో పంటచేలు నీటమునిగాయి. మెరక పొలాల్లో నీరు నిలిచినప్పటికీ వరిపైరు మునగలేదు. పల్లపు చేలల్లో, తూములు ఉన్న పొలాలు మాత్రం చెరువులను తలపించేలా వరిపైరు పూర్తిగా నీటమ నిగి ఒకటి రెండు రోజుల్లో పైరు బటయపడుతుందా అన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఎగువ నుంచీ వచ్చిన వర్షపునీరు దిగువ పొలాల్లోకి చేరటంతో పలు ప్రాంతాలు చెరువులను తలపించాయి. మేకావారిపాలెం, పాగోలు ప్రాంతాల్లో మురుగు కాల్వలు, చేలు ఒక్కటిగా మారాయి. లంకతోట రోడ్డులో పొలం చెరువును తలపించేలా మారగా, చిల్లలవాగులో కలిసేచోట తూముల వద్ద పూడికతీయటంతో నీటిసరఫరా వేగంగా జరుగుతోంది. చిం తలమడలో పొలాలు పూర్తిగా నీటమునిగాయి. నడకుదురు కృష్ణా కరకట్ట దిగువన మెట్ట పొలాలకు సైతం వర్షం ముంపు సమస్యను తీసుకువచ్చింది. నడకుదురు, రాముడుపాలెం ప్రాంతాల్లో పసుపు చేలల్లో భారీగా నీరుచేరింది. వర్షపునీరు కృష్ణానదిలో కలిసే అవకాశం గతంలో ఉండగా, మిగతా 2లో...



## రైతు కృతజ్ఞతా భారీ ట్రాక్టర్ ర్యాలీ 2



# సీఎం పర్యటనకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

- ఆగస్టు 15 న స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ఎన్జీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామనే హామీ మేరకు కూటమి ప్రభుత్వం 2025 ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 15 శుక్రవారం సాయంత్రం పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ సిటీ టెర్మినల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ఎన్జీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో జరిపిన సమీక్షలో మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)



## కుండపోత వర్షానికి నీటమునిగిన పంటపొలాలు

నాదెళ్లవారిపాలెం స్మశానవాటిక వద్ద పూడ్చివేయటంతో నీరు చేలల్లోనే నిలిచిపోయింది. ఒకటి రెండు రోజులు చేలల్లో నీరు నిలిచిఉంటే పసుపు తోటను పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. భారీ వర్షాలకు పంటచేలు నీటమునగటం, చేలల్లో నీరంతా డ్రైనేజీల్లోకి మళ్లటంతో డ్రైయిన్లు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ నుంచీ వచ్చే గుర్రపుడెక్క వంతెనల వద్దకు చేరుకుంటోంది. నీటిప్రవాహాన్ని అడ్డుకోకుండా ఉండేలా పుచ్చగడ్డ వద్ద డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, డ్రెయినేజీ ఏఈ చిరంజీవి పర్యవేక్షణలో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. మాజేరు లింగన్నకోడు వంతెన వద్దకు భారీగా గుర్రపుడెక్క చేరుకోవటంతో వంతెన పటిష్టతపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**ఈదురు గాలులకు నేలవాలిన అరటిచెట్లు, విరిగిపడిన చెట్లు**

కుండపోత వర్షానికి తోడు ఈదురుగాలులు వేయటంతో అరటిరైతులు తీవ్రంగా నష్టపోయారు. మరికొద్ది రోజుల్లో చేతికందే దశలో అరటి చెట్లు గాలులకు నేలవాలటంతో నోటికందాల్సిన పంట నేలవాలినట్లయింది. చల్లపల్లి మం డలం నడకుదురు, నాదెళ్లవారిపాలెం తదితర గ్రామాల్లో అరటిచెట్లు గాలులకు పడిపోయాయి. ఈదురుగాలులకు మంగళవారం రాత్రి పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. చల్లపల్లి-వక్కలగడ్డ ప్రధాన రహదారిలోనూ, కరకట్టపై పలు చోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. రహదారికి అడ్డుగా పడిన కొమ్మలను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేశారు. కరకట్టపై నాదెళ్లవారిపాలెం పరిధిలో చెట్టుకొమ్మలు విరిగిపడటంతో వాహనదారులకు అసౌకర్యం ఏర్పడింది.

## సీఎం పర్యటనకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు



ముఖ్యమంత్రి ప్రాంగణానికి వచ్చే ఏరియాలో ఏవిధమైన ట్రాఫిక్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచిస్తూ, వారు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం జరిగే ప్రాంతంలో తీసుకోవాల్సిన పోలీసు బందోబస్తు చర్యలను ఉన్నతాధికారులతో చర్చించారు. వేలమంది పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్ లోని సిటీ టెర్మినల్ కు వస్తారని వారికి కావలసిన త్రాగు నీరు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాధారణ ప్రజలకు ఏవిధమైన అడ్డంకులు కలగకూడదన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. నగరంలో ట్రాఫిక్ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని, బస్సులకు ఏవిధమైన అంతరాయం కలగకుండా సజావుగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తి అయ్యే వరకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా అందరు మహిళలే వస్తున్నందున్న దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులకు సూచించారు. సమీక్ష అనంతరం వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అంతేకాకుండా పబ్లిక్ గ్యాలరీ తదితరమైన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. గౌరవ ముఖ్యమంత్రి వచ్చే ప్రదేశం, వెళ్లే ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అంతేకాకుండా గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించే బస్సులు ఉంచే ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ పరిశీలించారు. కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, డీసీపీ (ఐఎస్ డబ్ల్యూ) ఎస్వీడీ ప్రసాద్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎమ్.వై. దానం, ఆర్టీసీ ఈడీ జీ. విజయ రత్నం, అసిస్టెంట్ డైరెక్టర్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ నాన్ క్యాడర్ ఎస్పీ టి. శోభా మంజరి, ఏసీపీ సౌత్ (లా అండ్ ఆర్డర్) డి. పవన్ కుమార్, ఆర్ అండ్ బీ డీఈ శశిభూషణ్, సెంట్రల్ ఎమ్మార్వో వెంకట్రామయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర నిర్మాణానికి ప్రగతి సూచికలే పునాదులు

**(మొదటిపేజీ తరువాయి)**

కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో పాటు శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకటరావు, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులు హాజరయ్యారు. తొలుత కలెక్టర్ లక్ష్మీశ.. సుపరిపాలనలో తొలి అడుగు పనుల్లో ప్రగతిని వివరించారు. మొత్తం రూ. 167.37 కోట్లతో శంకుస్థాపన చేసిన 1,661 పనుల్లో ఇప్పటికే 1,339 పనులు ప్రారంభోత్సవాలు పూర్తిచేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాకు సంబంధించి 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను, రంగాల వారీగా జీవీఏ, జీడీడీపీ, తలసరి ఆదాయ లక్ష్యాలను వివరించారు. సమావేశం సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునేందుకు నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. డీఆర్‌సీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. 2024-25లో జిల్లా జీడీపీ రూ. 94,561 కోట్లు కాగా దీన్ని 2025-26లో రూ. 1,12,057 కోట్లకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. అదేవిధంగా 2024-25లో తలసరి ఆదాయం రూ. 3,53,150 కాగా దీన్ని 2028-29 నాటికి రూ. 6,38,946కు చేర్చాల్సి ఉందన్నారు. ఇదేవిధంగా వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల్లో జీవీఏ వృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 విధానం అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలబెట్టేందుకు కృషిచేయాలని సూచించారు. ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని.. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పేర్కొన్నారు. విజయవాడ నగర ఘన వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకే విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించనున్నట్లు మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**లిడ్వాక్రా బజార్ల ఏర్పాటు కీలకం: ఎంపీ కేశినేని శివనాథ్**

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి వివిధ అంశాలను ప్రస్తావించారు. విజయవాడ అర్బన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు డ్వాక్రా బజార్ల ఏర్పాటు, ఎర్రకట్ట పై వంతెన ఆధునికీకరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ వర్క్ డీపీఆర్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలో ఫుడ్ కోర్టుల ఏర్పాటు, మూడు కాలువల గట్ల సుందరీకరణతో పాటు గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనలు, గ్రేటర్ విజయవాడ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా వచ్చే దసరా నవరాత్రుల సమయంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న దసరా ఉత్సవ్ విజయవంతానికి సమష్టి కృషి అవసరమని.. విజయవాడ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తం చేసే లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు మధురానుభూతులు మిగిల్చేందుకు ఈ ఉత్సవాలు దోహదం చేస్తాయని ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు.

# రైతు కృతజ్ఞతా భారీ ట్రాక్టర్ ర్యాలీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేసి చూపించేందుకు అహర్నిశలు శ్రమించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో ఎస్ ఎన్.గొల్లపాలెం నుండి మార్కెట్ యార్డు వరకు 250పైగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పాలాభిషేకం చేశారు. రైతులకు ప్రభుత్వం చేసిన సాయానికి కృతజ్ఞత తెలిపేందుకు ముందుకొచ్చిన ప్రతి రైతుకూ ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జగన్ రెడ్డికి, వారి ముఠాకు ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టడం, మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టడం తప్ప ఏమీ సాధ్యం కాదు. అభివృద్ధి చేయడం అంటే ఏంటో కూటమి ప్రభుత్వాన్ని చూసి జగన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నాం.ప్రజలు నమ్మి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. రైతులకు కేంద్రం రూ.6 వేలు ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి రూ.20 వేలు అందిస్తున్నాం. రైతుల ఖాతాల్లో రూ.3600 కోట్లు జమ చేసినందుకు సంతోషంగా ఉంది. పంట అమ్ముకునే రైతులు డబ్బులు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూడకూడదనే లక్ష్యంతో.. 24 గంటల్లోనే నిధులు జమ చేస్తున్నాం. రైతు పంట అమ్ముకుని ఇంటికి వచ్చేలోగా డబ్బులు జమ చేశాం. ఇప్పటి వరకు సుమారు రూ.12 వేల కోట్ల నిధులు రైతులకు అందించామని చెప్పడానికి గర్వపడుతున్నాను.మరోవైపు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేలా అడుగులు వేస్తున్నాం. కాలువల్లో పూడికలు తొలగించి రైతాంగానికి అండగా నిలుస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తక్షణమే పరిష్కరిస్తున్నాం. కోకో, పొగాకు, మామిడి రైతులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాం. అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు,తెలుగు రైతు విభాగం అధ్యక్షులు, వ్యవసాయ మిషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా జిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యన్నారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోపీచంద్, మాజీ ఎంపీపీ రూరల్ పార్టీ అధ్య క్షుడు కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పిచ్చేశ్వరరావు, జనసేన పార్టీ టౌన్ పార్టీ అధ్యక్షుడు గడ్డం రాజు,బీజేపీ మండలాధ్యక్షులు రామారావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పరబ్రహ్మం కూటమి నాయకులు పాల్గొన్నారు

# %లినగరంలో డ్రైనేజి సమస్యకు కారణం గత పాలకుల వైఫల్యమే



**విజయవాడ, మేజర్ న్యూస్ :** 2014-19 కాలంలో విజయవాడ నగరానికి స్ట్రాం వాటర్ నిధులు ద్వారా డ్రైనేజీ పనులు చేపట్టి రూ.250 కోట్లతో సగం పనులు పూర్తి చేయడం జరిగిందని, 2019 లో వైకాపా అధికారంలోకి వచ్చాక మిగిలిన నిధులతో పనులు చేయకుండా వాటిని ఇతర పనులకు వాడుకోవడంతో నగరంలో ఇంకా పలు రోడ్లు డ్రైనేజీ, వర్షపు నీటితో పొంగిపొర్లుతున్నా యని, నగరంలో డ్రైనేజీ సమస్యకు ప్రధాన కారణం గత పాలకుల వైఫల్యమేనని టిడిపి యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం 4వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో వర్షపు నీటితో నీట మునిగిన పలు రోడ్లను గద్దె క్రాంతికుమార్ స్థానిక తెదేపా నాయకులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ విజయవాడ గుంటూరు ప్రాంతాన్ని కలుపుతూ అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత 2014 నుంచి 2019 వరకు విజయవాడ నగరాన్ని చంద్రబాబు అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారన్నారు. దానిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి స్ట్రామ్ వాటర్ స్కీం కింద డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు రూ.450 కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం డ్రైనేజీ పనులు శరవేయంగా చేపట్టి రూ.250 కోట్లతో సగం పనులు చేయగా తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. విజయవాడ నగరాన్ని డ్రైనేజీ సమస్య నుంచి పరిష్కరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి నాగేశ్వరావు, రెడ్డి రాంబాబు, బత్తుల దుర్గారావు, కోడూరు ఆంజనేయ వాసు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా ముల్లంగి రామకృష్ణారెడ్డి





**జగ్గయ్యపేట,ఆగస్టు 13, మేజర్ న్యూస్ :** పోచంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పర్వత సంఘం అధ్యక్షులుగా ముల్లంగి రామకృష్ణారెడ్డి,సభ్యులుగా ఘన పరుపు లక్ష్మి, గొర్రపాటి సుబ్బారావు లు బుధవారం పదవి బాధ్యతలు చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా ముల్లంగి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పేరును నందమూరి తారక రామారావు 1987 వ సంవత్సరములో ఏక్ గవాక్ష పేరుతో ఎన్నికలు జరిపినారు. అప్పుడు నేను ఏడు ఓట్లతో ఓడిపోవడం జరిగినది. నా రాజకీయ జీవితంలో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం జరిగినది. కానీ సర్పంచిగా రెండు పర్యాయములు ఎన్నిక కాబడినాను. కోఆపరేటివ్ సొసైటీకి మూడు పర్యాయలు పోటీ చేస్తే. ఒకసారి ఆరు ఓట్లతోతేడాతో ఓటమి రెండోసారి లాటరీలో లాటరీ ద్వారా ఓటమి మూడోసారి ఒక డైరెక్టర్ పార్టీ మారటం వలన నాకు అధ్యక్ష అవకాశం రాలేదు 39 సంవత్సరాల తర్వాత నేను ఈరోజు చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టడం జరిగినది.

ఈ కార్యక్రమంలో కృష్ణ ఫర్ సొసైటీ అధ్యక్షులు యానాల గోపీచంద్ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కోటూర్ సత్యనారాయణ ప్రసాద్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎల్లంపల్లి రవి పార్టీ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రామారావు నీటి సంఘం అధ్యక్షులు ఏలూరు వెంకట కృష్ణారెడ్డి విద్యా కమిటీ చైర్మన్ పోతనబోయన నరసింహారావు ఇంకా గ్రామంలో అనేకమంది పాల్గొన్నారు.కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం కి స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ కి నాకు ఈ పదవి రావడానికి సహకరించినందుకు ధన్యవాదములుతెలియజేస్తున్నానన్నారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు ?7,000 వేల రూపాయలు అందజేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకీ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకీ,వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు చిత్రపటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం చేయడం జరిగింది.

# గుండేరు వంతెన వద్ద గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** గుండెరు వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించి నీట మునిగిన పంట పొలాలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన పొలాలను రైతు సంఘం, సిపిఐ నాయకులు బుధవారం సందర్శించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చల్లపల్లి మండల పరిధిలోని మాజేరులో నాయకులు మాట్లాడుతూ చిన్న కల్లేపల్లి, వక్కలగడ్డ, మంగళాపురం, భోగిరెడ్డిపల్లి, మాజేరు ప్రాంతాలలో నీట మరిగిన పంట పొలాలను పరిశీలించామని గుండెరు వంతెన వద్ద గుర్రపు డెక్క పెనవేసుకుపోవడంతో నీరు కదిలే పరిస్థితి లేక చేలన్నీ నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుర్రపుడెక్కును తొలగించి రైతులను కాపాడాలని కోరారు. యూరియా కొరతతో అల్లాడుతున్న రైతాంగానికి నీట మునిగిన పొలాలకు అదనపు యూరియా కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వెలబుచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతాంగాన్ని కాపాడవలసిన బాధ్యత ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన గుండేరు వంతెన వద్ద ఉన్న గుర్రపు డెక్కన్ తొలగించాలని డిమాండ్ చేశారు. గుర్రపు డెక్క తొలగించకుంటే గుండేరు ఆయకట్టన ఉన్న రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. గుండెరు డ్రైన్ ఎగదట్టటం వల్ల పంటలన్నీ నీట మునిగిపోయాయని తెలిపారు.

రైతాంగ బాధలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ సంఘం తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, నియోజకవర్గ కార్యదర్శి వేమూరి రత్నగిరి రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు నాయకులు చంద్ర సుబ్బారావు నాయకులు సిద్ధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

# సినీ సంగీత సాహిత్యాలలో వ్యక్తిత్వ వికాస పరిమళం




**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఆగస్టు 13 :** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జీరో సెమిస్టర్ లో మొదటి సంవత్సరం విద్యార్థులకు 'సినీ సంగీతంలో వ్యక్తిత్వ వికాస పరిమళం' అను అంశంపై తరగతులను నిర్వహించారు. జీవితంలో వ్యక్తిత్వం వికసించడానికి సంగీత సాహిత్యాలు శక్తివంతమైన సాధనాలనీ, ఇవి భావోద్వేగాలను అర్థం చేసుకుని, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాలు పెంపొందించడానికి, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, సాంస్కృతిక అవగాహన, తదితర విషయాలకు సహాయ పడతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయవాడ జి.వి.ఆర్. ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల గాత్ర ఉపన్యాసకులు కందుల లక్ష్మి నరసమ్మ మాట్లాడుతూ సంగీత సాధన ద్వారా వ్యక్తి లేదా విద్యార్థుల మనస్తత్వానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎలా దోహదం చేస్తుందో వివరించారు. పాటలు వినడం, పాడటమే కాకుండా వాటిలో భావాలను అర్థం చేసుకోవడం ద్వారా వ్యక్తులు తమ భావోద్వేగాలను అర్థం చేసుకోవడానికి, నిర్వహించడానికి, వ్యక్తీకరించడానికి, ఉపయోగ పడతాయని అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు విచారకరమైన పాట వినడం ద్వారా ఒక వ్యక్తి తన దుఃఖాన్ని అనుభవించడానికి, దానిని విడుదల చేయడానికి అవకాశం ఉండే విధంగా భావావేశాలను తెలుసుకొని నియంత్రించగలడని, పాటల సాహిత్యాన్ని విశ్లేషించడం ద్వారా వాటిలో దాగి ఉన్న భావాలను అర్థం చేసుకోవడం ద్వారా ఒక వ్యక్తి మరింత సృజనాత్మకంగా ఆలోచించడానికి, వ్యక్తీకరించడానికి నేర్చుకోగలడని, సమస్య వచ్చినప్పుడు ధైర్యం ఇచ్చే సాహిత్యం గల పాటలను వినడం ద్వారా సమయస్ఫూర్తితో వ్యవహరించగలరని, ప్రతిభా నైపుణ్యాలను బహిరంగంగా ప్రదర్శించడం ద్వారా విద్యార్థి తన భయాలను అధిగమించి, ఆత్మవిశ్వాసంతో ఉండగలరని, మంచి సాహిత్యం, సంగీతం ఉన్న పాటలను వినడం ద్వారా ధారణాశక్తి, ఏకాగ్రత పెంచుకోవడానికి ఎంతగానో తోడ్పడతాయని, సామాజిక పరమైన సహకారం, సమన్వయం,, కమ్యూనికేషన్ వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయనీ, వివిధ చిత్రాలలోని సాహిత్యవంతమైన పాటలను ఆలపిస్తూ వాటిలో దాగిఉన్న అంతర్గత అర్థాన్ని, సంగీతంలోని రాగాలను విడమర్చి విశద పరుస్తూ వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన విషయాలను సశాస్త్రీయంగా విద్యార్థులకు వివరించారు. గాయకులు మల్లిక్, స్వాతి లు గాత్ర సహకారాన్ని అందించగా, రవి, రమణ లు చక్కటి సంగీత సహకారాన్ని అందించారు. కార్యక్రమం నుండి ప్రేరణ పొందిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె.అఖిల చక్కటి సాహిత్యం తో కూడిన పాటను ఆలపించి శ్రోతల అభినందనలు పొందారు. అనంతరం సి.ఐ.పి. కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎల్.ఆర్. శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సురేష్, డాక్టర్ పి.విజయలక్ష్మి లు కందుల లక్ష్మి నరసమ్మ ను దుశ్శాలువ, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. కళాశాల పరీక్షలు నియంత్రణాధికారి డాక్టర్ శ్యామ్ సుందర్ పరీక్షల నియమావళిని, క్రెడిట్ పొందు విధానాలు తదితర పరీక్షా సంబంధిత విషయాలను విద్యార్థినీ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు. కళాశాల ఇంక్యూబేషన్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.మహేష్ బాబు సెంటర్ యొక్క ప్రయోజనాలను, కల్పించు సౌకర్యాలను, సాధించిన విషయాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ మార్కెట్లోకి పోకో ఎం7 ప్లస్ 5 జీ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ వినియోగదారు టెక్నాలజీ బ్రాండ్లలో ఒకటైన పోకో సరసమైన స్మార్ట్‌ఫోన్ విభాగంలో తన తాజా ఆవిష్కరణ పోకో ఎం7 ప్లస్ 5 జీని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. నాన్ స్టాప్ వినోదం, దీర్ఘకాలిక పనితీరు కోసం రూపొందించబడిన పోకో ఎం7 ప్లస్ 5 జీ భారీ 7000 ఎం ఏ హెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ, 144 హెచ్ జెడ్ రిఫ్రెష్ రేట్‌తో మద్దతు ఇవ్వ బడిన 6.9 అంగుళాల ఎఫ్ హెచ్ డీ ప్లస్ డిస్‌ప్లేతో ఈ విభాగంలో ముందంజలో ఉందని పోకో మొబైల్ విభాగ ప్రతినిధి చెప్పారు. ఇది కేవలం రూ. 12,999 లకు పోకో ఎం7 ప్లస్ 5 జీ 16జీ బీ వరకు టర్బో రామ్ తో జత చేయబడిన, సజావైన మల్టీ టాస్కింగ్ కోసం స్నాప్ డ్రాగన్ 6 ఎస్ జెన్ 3తో అధిక విలువైన పనితీరును అందిస్తుందన్నారు. 144 హెచ్ జెడ్ అడాప్టివ్ రిఫ్రెష్ రేట్ మృదువైన స్క్రోలింగ్, లీనమయ్యే గేమింగ్, అంతరాయం లేని సోషల్ మీడియా బ్రౌజింగ్‌ను నిర్ధారిస్తుందన్నారు. దీని 7000 ఎం ఏ హెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ, ఈ విభాగంలో అతిపెద్దది. 1600 ఛార్జ్ సైకిల్స్ కోసం రూపొందించ బడిందనీ, నాలుగు సంవత్సరాల ఉపయోగం తర్వాత కూడా 80 శాతం వరకు సామర్థ్యాన్ని నిలబెట్టుకుంటుంది అని అన్నారు.

# ఆయుర్వేద సూపర్ ఫుడ్‌లతో మొటిమలకు వీడ్కోలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆయుర్వేదం ప్రకారం, రుతుపవనాల సమయంలో వచ్చే కాలానుగుణ మార్పులు దోషాలను, ముఖ్యంగా వాత, పిత్త దోషాలను తీవ్రతరం చేస్తాయి. మొటిమలు, దద్దుర్లు వంటి చర్మ సమస్యలకు దారితీస్తాయి. హాట్ డ్రింక్స్, వేయించిన ఆహారాల పట్ల కోరికలు సహజమే అయినప్పటికీ, సరైన చర్మ సంరక్షణతో పాటు, ఆహారం ద్వారా ఈ సీజన్‌లో చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మధుమితకృష్ణన్ పేర్కొన్నారు. శరీరాన్ని పునరుత్తేజ పరచటానికి, చర్మ సమస్యలను నిర్వహించడానికి వర్షాకాలపు ఆహారం కొద్దిగా తీపిగా ఉండటంతో పాటుగా కొద్దిగా నూనె గల ఆహారాలు తీసుకోవటంతో వాత, పిత్త దోషాలను సమతుల్యం చేసుకోవాలని ఆమె సూచిస్తున్నారు. మొటిమలను దూరంగా ఉంచడానికి, స్పష్టమైన చర్మాన్ని కలిగి ఉండటానికి పోషకాలతో పాటు బాదం, పసుపు, ఆమ్లా, వేప, వెల్లుల్లి అనే ఐదు ఆయుర్వేద సూపర్ ఫుడ్‌లను సిఫార్సు చేస్తున్నారు.

# ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజెంక్య డీవై పాటిల్ కీలక ఒప్పందం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజెంక్య డీవై పాటిల్ హెల్త్‌కేర్ సంస్థలు ఒక వ్యూహాత్మక నిర్వహణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ద్వారా హైదరాబాద్‌లోని నిజాంపేటలో 800 పడకల అత్యాధునిక మల్టీ–స్పెషాలిటీ ఆసుపత్రిని కలిసి నిర్వహిస్తాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యం అందించడమే ఈ రెండు సంస్థల లక్ష్యం. ఈ కొత్త ఆసుపత్రిలో అత్యవసర చికిత్స, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వాటికి మంచి వైద్యం అందుబాటులో ఉంటుంది. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలకు వైద్యం కోసం వేరే చోటుకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. ఆసుపత్రి నిర్మాణాన్ని దశలవారీగా పూర్తి చేస్తారు. ఒక్కో దశ పూర్తయిన తర్వాత కొత్త సేవలను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ చైర్మన్ దండు శివ రామ రాజు మాట్లాడుతూ.. అందరికీ మంచి వైద్యం అందించాలనే తన కల ఈ ఆసుపత్రితో నెరవేరుతుందని అన్నారు. అజెంక్య డీవై పాటిల్ హెల్త్‌కేర్ చైర్మన్ డాక్టర్ అజెంక్య పాటిల్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం వల్ల రెండు సంస్థల సేవలు విస్తరించి, హైదరాబాద్ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ఈ ఒప్పందానికి యూకేలోని ఆప్టిమస్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థ సలహాలు ఇచ్చింది. ఈ సంస్థకు చెందిన అభయ్ అహుజా ఈ భాగస్వామ్యం దేశంలోనే ఇతర ఆరోగ్య సంస్థలకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. ఈ ఆసుపత్రి వల్ల హైదరాబాద్ వైద్య కేంద్రంగా మరింత బలోపేతం అవుతుంది. అలాగే, ప్రజలకు సరసమైన ధరల్లో, నమ్మకమైన వైద్య సేవలు అందుతాయి.

# శిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా"



**తిరువూరు మేజర్ న్యూస్:** జాతీయ సమైక్యతను చాటి చెప్పేందుకు నియోజకవర్గ పరిధిలోని గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామ శివారు జింకల పాలెం లో బుధవారం శిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 15న ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని విద్యార్థులు నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. లక్ష్మణ, షెహనాజ్ బేగం, అంగన్వాడీ కార్యకర్త షేక్ మీరాబీ, విశ్రాంత ప్రిన్సిపాల్ వెదురు వెంకటరెడ్డి, సాయిబాబా కమిటీ అధ్యక్షులు పూటుకూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# దివిసీమలో కుండపోత వర్షం కాలువలను తపిస్తున్న రహదారులు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి, రహదారులు సైతం కాలువల పొంగిపొర్లుతున్నాయి. నాటులు వేసిన పంటపొలాలు అన్ని నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి ఈ ఏడా ది పంట కాలువలు ముందస్తుగానే సాగునీటినీ విడుదల చేసినప్పటికీ గత 40 రోజులుగా వర్షపాతం ఏమీ నమోదు కాకపోవడంతో పంట పొలాలు పూర్తిస్థాయిలో తడవ క నాట్లు నత్త నడకన సాగాయి.గత నాలుగు రోజులుగా పంట కాలవలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయడంతో నాట్లు ఊపు అందుకున్న తరుణంలో మంగళవారం రాత్రి మూడు గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి దివిసీమ స్తంభించిపోయింది. వర్షానికి తోడు కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వర్షపాతం137.2 మిల్లీమీటర్లగా నమోదు అయింది. అవనిగడ్డ నాగాయలంక ప్రధాన రహదారులపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తూ బుధవారం ఉదయం 11 గంటలకు బయటపడ్డాయి దీనితో ప్రభుత్వ కార్యాలయాలు నీట మునిగాయి.సబ్ ట్రెజరీ కార్యాలయం, ఆర్టీసీ డిపో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల జల దిగ్బంధం లో చిక్కుకుపోయాయి. మండల పరిధిలోని అశ్వరావు పాలెం, మోదుమూడి, వేకనూరు, తుంగలో వారి పాలెంలో గ్రామాలలోని పంట పొలాలు అన్ని వర్షార్పణం కాగా పులిగడ్డ పాత ఎడ్లంక దక్షిణ చిరుగోలంక రామచంద్రపురం గ్రామాలలోని వాణిజ్య పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి 40 రోజులపాటు ఆగి ఆగి కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది అవనిగడ్డలోని లోతట్టు ప్రాంతాలు అయినా లంకమ్మ మాన్యం రాజశేఖర్ పురం మండలిపురం సింహాద్రి కాలనీ ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలు నీటమునకుగా కొన్ని గృహాల లోకి సైతం వర్షం నీరు చేరగా తొమ్మిదో వార్డులోని ఒక నివాసాన్ని వర్షపు నీరు చుట్టుముట్టి పూర్తిస్థాయిలో ప్రవేశించింది దీనితో ప్రజలు ఇంటి నుండి బయటకు రావాలంటే అసహనానికి గురయ్యారు



## భారీ వర్షం నేపథ్యంలో వలకట్ల తొలగింపు

**కోడూరు మేజర్ న్యూస్ :** భారీ వర్షం నేపథ్యంలో రత్నకోడు మేజర్ డ్రైనేజీలో వలకట్ల తొలగింపు చేపట్టినట్లు డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబూ నాయక్ తెలిపారు. బుధవారం కోడూరు, మండల పరిధిలోని రత్నకోడు మేజర్ డ్రైనేజీ పరిధిలో ముంపు నివారణ చర్యలు చేపట్టారు. జరుగు వానిపాలెం నుంచి సంగమేశ్వరం వరకూ రత్నకోడులో ఉన్న వలకట్లను తొలగిస్తున్నారు. నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ముంపు మళ్ళింపు చర్యలు వేగవంతం చేసినట్లు డీఈఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ అబ్దుల్ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షానికి నీట మునిగిన వరి పొలాలు



**కోడూరు మేజర్ న్యూస్ :** మండలంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. ముఖ్యంగా జయపురం. లింగారెడ్డి పాలెం రహదారికి ఇరువైపులా ఉన్న పొలాలు చెరువులను తలపిస్తున్నాయి రత్నకొడు కింద ఉన్న క్యాచ్ డ్రైన్ పూర్తిగా నీటితో నిండిపోవడంతో పొలాల నుంచి నీరు బయటకు వెళ్లే మార్గం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అలాగే లింగన్నకోడు పరిస్థితి అలాగే ఉంది డ్రైనేజీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికీ వేల ఎకరాల్లో పంట నేత మునగటంతో రైతులు ఏమి చేయాలో తోచని అయోమయ స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

## కురిసిన వానకు నీట మునిగిన పంట పోలాలు



**కోడూరు మేజర్ న్యూస్ :** అవనిగడ్డ, నా గాయలంక, కోడూరు, మోపిదేవి,చల్లపల్లి, మండలాల్లో రెండు గంటలకు కురిసిన వానకి సముద్రాన్ని తలపించేలా పంట పొలాలు మారిపోయాయి. 15,000 రూ పెట్టుబడి పెట్టి పంట భూమిని సాగు చేస్తున్న రైతులు. నీట మునిగిన పొలాలను చూసి ఆవేదన చెందుతున్నరే తప్పితే డ్రైనేజీ వ్యవస్థను ఆక్రమించి పూడ్చి భ్రష్టు పట్టిస్తున్నారు. ముంపుకి గురవుతున్నామని గమనించడం లేదు దానికి తగినట్లుగా కాంట్రాక్టర్లు కూడా నాసిరకం పనులు చేస్తుండటం రెండు గంటలు కురిసిన వానకే ము నిగిపోవడానికి కారణం అవుతున్నాయి. దానికి తోడు అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం వలన ఈ ముంపుకు కారణం అవుతుంది. తక్షణమే అధికారులు స్పందించి ఆక్రమణలకు గురవుతున్న డ్రైనేజీ భూములను గుర్తించి మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



## "అన్నదాత సుఖీభవ" కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి కి పాలాభిషేకం

**జగ్గయ్యపేట,ఆగస్టు 13,మేజర్ న్యూస్ :** గౌరవరం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయము వద్ద రైతులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు చంద్రన్న సుఖీభవ అంటూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకంతో తమ హర్షద్వానాలను వెలబుచ్చినారు. ఈ కార్యక్రమంలో నూతన పిఎసిఎస్ అధ్యక్షులుగా నియమించబడిన కట్టా వెంకట నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, కృష్ణ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ యానాల గోపీచంద్, గోపాలకృష్ణ సొసైటీ చైర్మన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొటారు సత్యనారాయణ ప్రసాద్, మండల సమైక్య అధ్యక్షురాలు గద్దె రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ ముత్తవరపు వెంకటేష్ పావని, గ్రామ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ జాన్ బాషా, ప్రధాన కార్యదర్శి కొప్పుల రాము, నీటి సంఘం ఉపాధ్యక్షులు సాదినేడి శేషగిరి, పసల రమేష్ బాబు, దుగ్గిరాల మహేష్ బాబు, కాశి నీడి బుజ్జిబాబు,గ్రామ తెలుగుదేశం పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నీట మునిగిన శిధిలావస్థలోని బస్టాండ్ ప్రాంగణం




**నాగాయలంక ఆగస్టు /13 మేజర్ న్యూస్ :** రాత్రి కురిసిన భారీ వర్షానికి నాగాయలంక గ్రామంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ మొత్తము నీట మునిగి ఉన్నది బస్సులు రాకపోకలకు అంతరాయము కలుగుచున్నది దూర ప్రాంతాల నుండి బస్సులు బస్ స్టేషన్ ప్రాంగణంలోకి వచ్చుటకు ప్రవేశము లేకుండా మునిగి ఉన్నది.బస్ స్టేషన్ ప్రాంగణంలోని ప్రయాణికులు వేచి ఉండు నిర్మాణము అచ్చులు అచ్చులు గా ఊడిపోతూ ఎప్పుడు పడిపోవునో తెలియకుండా బస్టాండ్ లోనికి వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయం పైన ఆర్టీసీ డిపో మేనేజర్కి తెలియ పరచిన ను సరైన సమాధానం తెలియ పరచడం లేదు. పడి పోవుటకు సిద్ధంగా ఉన్న నాగాయలంక బస్టాండ్ లోనికి ప్రజలు దూరప్రాంత ప్రయాణికులు వచ్చి బస్సులు ఎక్కుటకు, ప్రయా ణించుటకు ఇబ్బందులు పడు తున్నారు.మెయిన్ సెంటర్ వద్దకి వచ్చి ఎక్కువ దా మన్న ట్రాఫిక్ సమస్యతో అచ్చట నున్న వ్యాపారస్తుల వారి వద్ద నుంచి ఇబ్బందులు పడుతున్నారు.కనుక ప్రజలు శాశ్వత పరిష్కార దిశగా బస్టాండ్ ప్రాంగణము బాగు పరిచి,చుట్టుపక్కల గల గ్రామస్తులకు తీర ప్రాంత ప్రజలకు దూర ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌకర్యము లకు ఇబ్బంది లేకుండా, సౌకర్యములు కల్పించ వలసింది గా నాగాయలంక చుట్టుపక్కల గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## తెలుగు భాషా ప్రేమికుడు మండలి వెంకట కృష్ణారావు 10 వ రోజు వేడుకలు



**నాగాయలంక ఆగస్టు 13 మేజర్ న్యూస్ :** గ్రామంలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నాగాయలంక మండల బిజెపి అధ్యక్షుడు గుడివాక శివాజీ పూల మాల వేసి నివాళులు అర్పించారు. పదవరోజు నాగా యలంకలో దివిసీమ పునర్ని ర్మాత తెలుగుజాతిరత్నం స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శతజ యంతి వేడుకలు సందర్భంగా కృష్ణారావు విగ్రహానికి నిర్వహణ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగానివాళులు అర్పిం చారు శతజయంతి వేడుకలు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత టిడిపి మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు బండ్రెడ్డి హరి మార్కెటింగ్ యాడ్ డైరెక్టర్ ఉప్పల ప్రసాద్ మాదివాడ అర్జునరావు, రే మాల బాబురావు చిట్టా శ్రీనివాసరావు తాడేపల్లి పాపారావు బుజ్జి కాట్రగడ్డ సాంబశివరావు భాషాభిమానులు పాల్గొన్నారు..

## రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం



**జి కొండూరు మేజర్ న్యూస్ :** రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.మైలవరం మండలం తోలుకోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. చైర్మన్ గా కోటగిరి వెంకటేశ్వరరావు సభ్యులుగా పామర్తి దశరథ, గొట్టి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కృష్ణప్రసాదు పాల్గొన్నారు. సొసైటీ త్రిసభ్య కమిటీని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు అన్నదాతలకు, సొసైటీ సభ్యులకు విశేష సేవలందించాలని వారికి సూచించారురైతులకు సకాలంలో ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి సీఈపై ఎమ్మెల్యే వసంత సీరియస్

**మైలవరం-నూజివీడు రోడ్డుతో పాటు అభివృద్ధి పనుల విషయంలో కక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తున్న సీఈ**

**వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చానని సీఈ కక్ష కట్టాడు**

**48 గంటల్లో మైలవరం-నూజివీడు రోడ్డు అభివృద్ధి టెండర్లు పిలవాలి**

**లేకుంటే సీఈ కార్యాలయం ముందు బైఠాయిస్తా**

**-మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రహదారులు భవనముల శాఖ ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డిపై మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సీరియస్ అయ్యారు. పలు అభివృద్ధి పనుల విషయంలో తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడని, వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీకిలోనికి తను రావడాన్ని జీర్ణించుకోలేకనే అతను ఇలా చేస్తున్నాడని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పేర్కొన్నారు. విజయవాడలో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు బుధవారం మాట్లాడారు. ఆర్ అండ్ బి సీఈ నిర్వాకం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయి, ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన చెందారు. వెల్వడం వద్ద రహదారి ధ్వంసం అయిన వీడియోను స్వయంగా చిత్రీకరించి సమావేశంలో ప్రదర్శించారు. అక్కడి ప్రజలు పడుతున్న అవస్థలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో ప్రధాన రహదారి అయిన మైలవరం నుంచి నూజివీడు వెళ్లే బీటీ రోడ్డు అభివృద్ధికి తను గతంలోనే ప్రభుత్వం నుంచి రూ.7.5 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ వర్క్ ను గుత్తేదారు చేస్తున్నప్పటికీ దీన్ని ఆర్ అండ్ బి అధికారులు క్యాన్సిల్ జాబితాలోకి చేర్చి పనులు నిలిపివేశారన్నారు. మళ్ళీ ఇక్కడి సమస్య తీవ్రత దృష్ట్యా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి మళ్ళీ ఈ రోడ్డు అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. దీనికి కూడా నిలిపివేయాలని ఆర్ అండ్ బి సీఈ శ్రీనివాసరెడ్డి కొత్తపథకం రచించాడన్నారు. రహదారి అధ్వాన్నంగా ఉన్న మైలవరం నుండి కాకుండా, రోడ్డు బాగానే ఉన్న నూజివీడు వైపు నుంచి పనులు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశాడని అన్నారు. ఇలా చేయడం వల్ల నూజివీడు నుంచి చంద్రాల వరకు మాత్రమే నిధులు సరిపోతున్నాయన్నారు. దీనివల్ల ప్రధాన సమస్య అలానే ఉంటుందన్నారు. దీనిపై మళ్ళీ తను మంత్రి వద్దకు వెళ్లి దాన్ని మార్పు చేయించి, ఆర్థిక శాఖ నుంచి క్లియరెన్స్ తెచ్చి మైలవరం నుంచి రహదారి ప్రారంభించి నూజివీడు వరకు అభివృద్ధి చేయాలని అనుమతులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. దీనికి కూడా అధికారులు తయారుచేసిన ప్రతిపాదనలను ఫైనలేజ్ చేయకుండా సీఈ 15 రోజుల నుంచి ఎన్నో వంకలు పెడుతున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే గుంటలుగా మారిన ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాల బారినపడి దాదాపుగా 6గురు మృతి చెంది, 25 మంది వరకు గాయపడ్డారని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశంలోకి వచ్చాననే కారణంతోనే తనపై సీఈ శ్రీనివాస్ రెడ్డి కక్ష గట్టి వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. మైలవరం-నూజివీడు రహదారి అభివృద్ధికి 48 గంటల్లో టెండర్లు పిలవాలని లేకుంటే బాధిత గ్రామాల ప్రజలతో సీఈ కార్యాలయం, ఇంటి ముందు బైఠాయిస్తానని హెచ్చరించారు. రహదారి అభివృద్ధిని కావాలని ఉద్దేశపూర్వకంగా సీఈ అడ్డుకుంటున్నారని, ఇది పూర్తిగా నిర్లక్ష్యం, దౌర్భాగ్యం, దరిద్రం అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కందులపాడు నుంచి విస్సన్నపేట వరకు విజయవాడ-విస్సన్నపేట ప్రధాన రహదారి విస్తరణతో కూడిన అభివృద్ధికి గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.40 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. పనులు ప్రారంభించలేదనే నాట్ స్టార్టెడ్ సాకుతో తనకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా ఈ వర్కును కూడా క్యాన్సిల్ చేశారని అన్నారు. పని ప్రారంభం కాకుంటే రీ టెండర్ పిలవాలని, కానీ ఈ వర్క్ ని అకారణంగా ఎందుకు క్యాన్సిల్ చేశారని ఆర్ అండ్ బి సిఈ శ్రీనివాసరెడ్డిని సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం నిధులను కూడా సద్వినియోగం చేయకుండా ఆర్ అండ్ బి సీఈ విధంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. తారకరామా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కింద ఏర్పాటు చేసిన లిఫ్ట్ లను నిర్వహించడానికి రూ.10కోట్లతో ప్రతిపాదనలు పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం హెడ్వాటర్ వర్క్స్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఏ.కొండూరు మండలాలకు చెందిన మొత్తం 120 గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా చేసే పథకం ఇటీవల కార్మికుల సమ్మె కారణంగా 5 రోజుల పాటు తాగునీరు నిలిచిపోగా 3లక్షల ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. సదరు కాంట్రాక్టర్కు, అధికారులకు మధ్య ఉన్న బిల్లుల సమస్యలను కూడా పరిష్కరించాలని అన్నారు. గతంలో సంభవించిన వరదల వల్ల పంచాయతీరాజ్ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీనికి సంబంధించి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.1.55 కోట్లతో ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరు చేయలేదన్నారు. మైలవరం నియోజకవర్గంలో గొల్లపూడి, ఈలప్రోలు లేఔట్, ఇబ్రహీంపట్నంలోని గాజులపేట లేఔట్, కొండపల్లి లేఔట్ లలో వెంటనే మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇక్కడ మౌలిక వసతులు కల్పించినట్లయితే మరి కొంతమంది నూతనంగా ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటారని పేర్కొన్నారు. జి.కొండూరు నుంచి గంగినేని వరకు కెజివై రోడ్డు అభివృద్ధి కూడా గడ్డమణుగు, మునగపాడు వద్ద కొంతదూరం నిలిచిందన్నారు. ఇది కూడా ఆర్ అండ్ బి అధికారుల నిర్వాకం వల్ల ఆగిపోయిందన్నారు. ఈ రోడ్డు కింద ఆర్డబ్ల్యూఎస్ కు చెందిన తాగునీటి పైప్లైన్ ఉన్నందున దీన్ని మార్పు చేసేందుకు ఆర్ అండ్ బి నుంచి నిధులు కేటాయించాలన్నారు. అకాల వరదలకు వెస్ట్ బైపాస్ వల్ల పొలాల్లో నీరు చేరి చాలామంది ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. దీనికి శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూపాలన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో చాలా ఇబ్బందులు పడతామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల డిమాండ్ దృష్ట్యా ఎరువులకు కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కోరారు.

# అధిక వర్షాలు, వరదలు పట్ల అప్రమత్తం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలు, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉన్నామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు వివరించారు. జిల్లాల్లో అధిక వర్షాలు, వరదలు దృష్ట్యా రాష్ట్ర హోంశాఖ మంత్రి బుధవారం సాయంత్రం అమరావతి రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను వివరిస్తూ గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు, కృష్ణానదికి పెరుగుతున్న వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. జిల్లాలో దుర్బలత్వం కలిగిన 62 గ్రామాలు, అదేవిధంగా 16 లంక గ్రామాలు ఉన్నాయని, గత సం.లో సంభవించిన వరదలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత విపత్తులను ఎదుర్కొనేందుకు ఆయా మండలాల అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. జిల్లాలో గత మూడు రోజులతో పోలిస్తే ఈ రోజు ఆగస్టు 13వ తేదీ అత్యధికంగా 83 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని తెలిపారు. వరద ఉధృతిని బట్టి లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోట్లు, ఇతర రవాణా సౌకర్యాన్ని సిద్ధంగా ఉంచినట్లు



తెలిపారు. విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఎంపీడీవోలు, రెవెన్యూ, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు హోం మినిస్టర్కు వివరించారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ విభాగాన్ని ఏర్పాటు చేశామని, గ్రామాల్లో టాంటాం వేయించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, సిపిఓ ఎస్ భీమరాజు, జిల్లా పౌర సరఫరాల అధికారి జి మోహన్రావు, పశు సంవర్ధక శాఖ అధికారి చిన నరసింహులు, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, అగ్నిమాపక శాఖ అధికారి యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

# దాతలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

మచిలీపట్నం మేజర్ న్యూస్ : నగరంలో నిర్వహించే అన్న క్యాంటీన్ కు లక్ష రూపాయలు, అన్నా క్యాంటీన్లో ప్రజల దాహార్తిని తీర్చే విధంగా ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు గాను 74,340/- రూపాయలు మొత్తం కలిపి 1,74, 340/- రూపాయల సొమ్ము ను చెక్కుల రూపేణా ప్రముఖ వైద్యులు డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య బుధవారం మంత్రి కొల్లు రవీంద్రకు అందజేశారు. రవీంద్ర మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలని రవీంద్ర పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలన ను లక్ష్యంగా తీసుకుని బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు రూపొందించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బంగారు కుటుంబాలకు కావాల్సింది భావోద్వేగాలతో కూడిన బంధం, చేయూతేనని రవీంద్ర తెలిపారు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పి4 కార్యక్రమాన్ని మనమందరం భాగస్వాములై ముందుకు తీసుకువెళ్లాలన్నారు.



డాక్టర్ ధన్వంతరి ఆచార్య దాతృత్వాన్ని మంత్రి రవీంద్ర కొనియాడారు. నగర కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్, కుంచె నాని, టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు, పి. వి. ఫణి కుమార్, పాల్గొన్నారు.



## మానసిక సౌందర్యాన్ని పెంపొందించుకోవాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మహిళలు బాహ్య సౌందర్యంతో పాటు మానసిక సౌందర్యాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అన్నారు. స్థానిక వేడుక ఫంక్షన్ హాల్ లో సామా కుమారి, చిట్టి కుమారిల ఆధ్వర్యంలో గరుడ సేవా సమితి స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నీలిమ మాట్లాడుతూ మహిళలు అబలలు కాదు సబలలని అన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసం, ధైర్యంతో అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ గరుడ సేవా సమితి చేస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఇంకను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ భాష, కాళీ, బాబా ప్రసాద్, సేవాసమితి సభ్యులు స్నేహితుల దినోత్సవ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా హౌసీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సమితి సభ్యులందరూ ఈ కార్యక్రమాలలో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

## స్టేట్ టాపర్ కే వి డి దుర్గాభవానినీ అభినందించిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** 2025 మెగా డి ఎస్ సి ఫలితాలో విజయవాడ ప్రతిభ కోచింగ్ సెంటరో శిక్షణ పొందిన విద్యార్దులో స్టేట్ టాపర్ గా కే వి డి దుర్గా భవాని,, నాగసాయి వైదేహి, శ్రీవల్లి, పూజిత, ఉమాదేవి, రాజశేఖర్, శివనాగదుర్గారావు, రాజమోహనరెడ్డిని అభినందించిన ఆర్టీసీ చైర్మన్ కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర బీసీ నాయకులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య ఆర్టీసి డిపో మేనేజర్ పెద్దిరాజు, ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్, యార్లగడ్డ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్టర్ కార్యాలయంలో అమలు చేయలేని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు ఒకటి నుండి ఏ విధమైన రుసుము చెల్లించకుండా మున్సి పాలిటీ/ కార్పొరేషన్లలో ఆస్తి పన్ను పేరు మార్పిడి జరుగుతుందని ఇచ్చిన సర్కులర్ ను అమలు చేయడంలో మచిలీపట్నం రిజిస్టర్ కార్యాలయం పూర్తిగా వైఫల్యం చెందిందని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బాలాజీ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం స్లాట్ సిస్టం ఏర్పాటు చేసి ఏ విధమైన రుసుము లేకుండా పురపాలక సంఘాల్లో కార్పొరేషన్లో పేరు మార్పిడి జరుగుతుంది, 24 గంటల్లోనే అధికారుల పేర్లు మారుస్తారని చెప్పి సర్కులర్ జారీ చేశారు. 24 గంటలు కాదు కదా 24 రోజులు దాటిన మ్యుటేషన్ జరగటం లేదు అని, ఇది అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని బాలాజీ అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 24 గంటలలో పురపాలక సంఘం లో/ కార్పొరేషన్లలో కొత్త రిజిస్ట్రేషన్ ప్రకారం ప్రభుత్వ జీవో ప్రకారం పేరు మార్పులు జరగాలని బాలాజీ డిమాండ్ చేశారు.. ఆస్తి పన్ను పేరు మారకపోవడం వల్ల కార్పొరేషన్ లో బిల్డింగ్ ప్లాన్ లు పెండింగ్ లో ఉంటున్నాయని తద్వారా ప్రభుత్వానికి కూడా ఆర్థికంగా నష్టం కలుగుతుందని బాలాజీ అన్నారు. బిల్డింగ్ నిర్మాణాలు ఆగిపోయినాయి అని భవనం నిర్మాణ కార్మికులకు పని ఉండటం లేదని బాలాజీ అన్నారు. వెంటనే పేరు మార్పిడి పై రాష్ట్ర ప్రభుత్వ సర్కులర్ ను రిజిస్ట్రేషన్ అధికారులు కార్పొరేషన్ అధికారులు అమలు చేసి ప్రజలకు వెసులుబాటు కల్పించాలని బాలాజీ డిమాండ్ చేశారు.

## గృహప్రవేశంలో శాసనసభ్యులు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని జూపూడి గ్రామ సర్పంచ్ కాకి దేవమాత గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఉదయం జూపూడిలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు కృష్ణప్రసాదు కాకి దేవమాత కి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో వారు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ముంపు మళ్లింపు చర్యలు వేగవంతం చేశాం



**కోడూరు మేజర్ న్యూస్ :** కుండపోత వర్షం కురిసిన నేపథ్యంలో నియోజకవర్గంలో ముంపు మళ్ళింపు చర్యలు వేగవంతం చేసినట్లు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రైనేజీ శాఖ అధికారులు కోడూరు మండలం జరుగువానిపాలెం నుంచి ఇరాలి వరకూ రత్నకోడు మేజర్ డ్రైనేజీపై వలకట్ల తొలగించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ముంపు సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ అవరోధాలు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఔట్ ఫాల్ స్లూయిజుల వద్ద తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డ్రైనేజీ శాఖ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలిసి నిరంతర పర్యవేక్షణతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి పంట నష్టం వాటిల్లకుండా ఇకముందు కురిసే భారీ వర్షాలకు సైతం ముంపు సమస్య రాకుండా వర్షపు నీరు ఎప్పటికప్పుడు డ్రైనేజీల ద్వారా సముద్రంలోకి మళ్ళించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## సోమనాథ్ చటర్జీకి ఘనంగా నివాళులు

**పామర్రు ఆగస్టు 13 మేజర్ న్యూస్ :** లోక్ సభ మాజీ స్పీకర్, అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత కామ్రేడ్ సోమనాథ్ ఛటర్జీ 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం పామర్రు లో ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక పుట్లమ్మ సత్రం భవనం మీద జరిగిన కార్యక్రమంలో సోమనాథ్ ఛటర్జీ చిత్రం పటానికి సి.పి.యం.సీనియర్ నాయకులు కాటూరి నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో భవనం నిర్మాణ సంఘం జిల్లా కోశాధికారి వేము పెదబాబు, సి.పియం పామర్రు మండల మాజీ కార్యదర్శి దునుకు రఘునాధరావు, చిరికి వెంకటేశ్వరరావు, నాయకులు బుద్దులు మురళి, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఇంగ్లీష్ లెక్చరర్ పెనుమాల వెంకటేశ్వరరావు, పాస్టర్ సాల్మన్ రాజు కొల్లాబత్తుల, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పసుపులేటి నరసింహారావు, ఈడే కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సోమనాథ్ ఛటర్జీ స్పీకర్ పదవికే వన్నె తెచ్చారని, హుందాగా వ్యవహరించి భావితరాల స్పీకర్ లకు ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

# మాదకద్రవ్యాల వినియోగం పై అవగాహన సదస్సు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నాషా ముక్తా భారత్ అభియాన్ ఏర్పడి ఐదు సంవత్సరాలు అయిన సందర్భంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం లోని పద్మావతి మహిళ కళాశాలలో బుధవారం డ్రగ్స్ కు వ్యతిరేకంగా మాస్ ప్లెడ్జ్ కార్యక్రమం ను నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రులతో శాఖ,మేరా యువభారత్,మైభారత్, కృష్ణాజిల్లా ఎక్సైజ్ శాఖ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాషా ముక్తా భారత్ అభియాన్ ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నాశముక్త భారత్ మాస్ ప్లెడ్జ్ కార్యక్రమాన్ని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి జి గంగాధర రావు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లవైపు ముఖ్యంగా మత్తు పదార్థం వైపు మొగ్గు చూపుతున్నారని వారిని అటువైపు వెళ్ళకుండా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని అన్నారు. 1972 అనే నెంబర్ టోల్ ఫ్రీ నెంబర్ ను ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి వంటి వాటిని వినియోగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తుందని, విద్యార్థులు ఎప్పటికప్పుడు మరకద్రవ్యాల వినియోగంతో కలిగే ప్రతికూల అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ సందర్భంగా చిలకలపూడి పోలీస్ స్టేషన్ ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు వేమన చందన మాట్లాడుతూ విద్యార్థులు మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. కళాశాల దశ నుండే చెడు అలవాట్లకు, దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. మారకద్రవ్యాలను ఉపయోగించడం వలన యువతలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడి శారీర,మానసిక రుగ్మతలు కలుగుతాయి అన్నారు. సిగరెట్స్,మందు వంటి వాటిని తీసుకుంటూ మెల్లమెల్లగా డ్రగ్స్ వైపు యువత దృష్టి పడుతుందన్నారు. మత్తు పదార్థాల్ని దూరం పెట్టాలన్నారు. వీటన్నిటికీ దూరంగా ఉండాలని సూచించారు.దూరాలవాటులు లేకుండా పని,చదువుపై యువత దృష్టి పెట్టాలని ఆమె కోరారు. అనంతరం అధికారులు అందరూ కలిసి పోస్టర్లు రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి అన్నపూర్ణ, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపర్డెంట్ అధికారి భార్గవ్, ఎన్జీవో నేత ఆకూరి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదికి 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చే అవకాశం



**జి కొండూరు మేజర్ న్యూస్ :** కృష్ణానదికి 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చే అవకాశం ఉందని, నదీ పరివాహక ప్రాంతాల్లో, లంక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లో అయినా సేవలందించడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి మంగళవారం 2 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఇది క్రమేపీ విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి చేరుతోందన్నారు.నేడు బుధవారం 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పెరిగే అవకాశం ఉందన్నారు. ఎగువన కురుస్తున్న వర్షపు నీరు చేరుతున్న కారణంగా ఇది మరింత పెరిగి ప్రకాశం బ్యారేజీకి 4 లేదా 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందన్నారు.ప్రజలు కృష్ణానదిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, నాటు పడవుల్లో ప్రయాణించడం వంటివి చేయవద్దని సూచించారు. నదిలో ఈతకు వెళ్లకుండా టాం టాం ద్వారా చాటింపు వేయాలన్నారు.రానున్న రెండు లేదా మూడు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఇప్పటికే ప్రకటించినట్లు పేర్కొన్నారు.లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎన్డీఏ కూటమి నాయకులు కూడా ప్రజలను ఎక్కడికక్కడ అప్రమత్తం చేయాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని సిద్ధం చేయాలని, 24 గంటల పాటు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు నది వద్దకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.ఇసుక బస్తాలు, ఇతర రక్షణ చర్యలు చేపట్టేలా స్థానికంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి సమాచారం వచ్చినా క్షేత్ర స్థాయిలోకి వెళ్ళి పరిస్థితిని బట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రక్షణ, భద్రత ఏర్పాట్లలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేసి ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆదేశించారు.

# భారీ వర్షాలకు నీట మునిగిన పొలాలు

## ఆక్రమణలు తొలగించాలంటూ తహసిల్దార్ లేఖ రాసినా స్పందించని పంచాయతీ కార్యదర్శి

## ఆక్రమణలు తొలగించి ముంపు బారి నుండి తమ పొలాలు కాపాడాలంటూ రైతుల ఆందోళన



**పెదపారుపూడి ఆగస్టు 13 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదపారుపూడిలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు నీట మునిగి నాటువేసిన పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పెదపారుపూడి గ్రామంలోని పడమటి వైపు గల పొలాలు నీరు బయటకు పోయే మార్గం లేక నీట మునిగాయి. ఈ పొలాలకు సంబంధించి నీరు బయటకు పోయే పంట బోదె కు ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ పలువురు రైతులు కోరుతున్నారు. ఈ ఆక్రమణకు సంబంధించి గ్రామానికి చెందిన జాజుల సుబ్రహ్మణ్యం ఈ బోదెపై తూములు వేసి రహదారిగా వినియోగిస్తున్నారని, నీరు బయటకు పోవడం లేదని గత నెలలో పి.వరప్రసాద్ తో పాటు పలువురు రైతులు తహసిల్దార్ బి.శ్రీను నాయక్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ గ్రామ రెవెన్యూ అధికారి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లతో విచారణ జరుపగా ఆక్రమణలు యదార్థమేనని నిర్ధారించారు. దీనిపై ఆయన ఈ ఆక్రమణలు తొలగించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి గత 21వ తేదీన లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ ఆక్రమణ కారణంగా సర్వే నంబర్లు 195, 196, 245, 258, 259 లలో గల భూములు ముంపునకు గురవుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ సర్వే నంబర్ లలో ఉన్న సుమారు 60 నుండి 70 ఎకరాల వ్యవసాయ భూములు ఆక్రమణల కారణంగా ముంపు బారిన పడుతున్నాయని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు. దీనిపై పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ జీవో నెంబర్ 188/21.07.2011 ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శిని ఆ లేఖలో తహసిల్దార్ కోరారు. అయితే పంచాయతీ కార్యదర్శి నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని, తమ భూములను ముంపు బారి నుండి కాపాడాలని గ్రామ మాజీ సర్పంచ్ గారపాటి వీరనాగ బాబురావు కోరారు. కాగా గ్రామానికి చెందిన రైతులు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు మాజీ సర్పంచి వీరనాగ బాబురావు తో కలిసి బుధవారం నీట మునిగిన తమ పొలాల వద్ద నిలబడి ఆందోళన చేశారు.



# జగ్గయ్యపేటలో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



**జగ్గయ్యపేట,ఆగస్టు 13, మేజర్ న్యూస్ :** మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోది పిలుపు మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు బిజెపి జగ్గయ్య పేట పట్టణ అధ్యక్షులు యాపొగ్ రాజా బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు నల్లబోతు శివ జొన్నలగడ్డ షణ్ముఖ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట వివిధ పాఠశాల లు, కళాశాల వారి సహకారంతో ఎన్టీఆర్ సర్కిల్‌లో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ ఎందరో దేశభక్తుల బలిదానాలతో వచ్చిన 79వ స్వాతంత్ర్యాన్ని గుర్తు చేసుకుంటూ ప్రధాని నరేంద్ర మోదిగారు ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురువేయలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా యాత్రలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు అదేవిధంగా అమెరికా విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా విదేశీ వస్తువులనుబహిష్కరించాలి,స్వదేశీ వస్తువులను కొనుగొలు చెయ్యాలని ప్రధాని మోది పిలుపు మేరకు మనందరం స్వదేశీ వస్తువులను కొనొగోలు చెయ్యాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చేగు స్కూల్ విద్యార్థులు తిరంగా గానాన్ని ఘోష్ (డప్పుల) వాద్యాలతో ప్రదర్శించారు, వివిధ పాఠశాల కళాశాల నుంచి విద్యార్థిని విద్యార్థులు సుమారు 500 మీటర్ల జాతీయ జెండాతో 1500 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.చేగు విద్యాలయం, నాగార్జున హై స్కూల్ శ్రీ వెంకటేశ్వర హై స్కూల్,నారాయణ టెక్నో స్కూల్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్, విజేత పబ్లిక్ స్కూల్ వాగ్దేవి ఇంటర్మీడియట్ కాలేజ్ అమ్మాని జూనియర్ కాలేజ్ విశ్వ భారతి డిగ్రీ కాలేజ్ లైవ్ స్కిల్ సెంటర్ శ్రీ లక్ష్య జూనియర్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిఅన్నేపాగా ప్రపుల్ల శ్రీకాంత్, బిజెపి ఎన్టీఆర్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు సభ్యులు కీసర రాంబాబు, బిజెపి జగ్గయ్యపేట నియోజకవర్గ కన్వీనర్ మన్నే శ్రీనివాస్, టిడిపి నాయకులు శ్రీరామ సుబ్బారావు శ్రీరామ్ ధనంజయ (చిన్న బాబు), లక్ష్మణరావు, బిజెపి జిల్లా కార్యదర్శి కల్లూరి శ్రీవాణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట ఎస్సై రాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, చిల్లకల్లు ఎస్ఐ సూర్య, బీజేపీ జగ్గయ్యపేట రూరల్ మండల అధ్యక్షులు పగిడిపర్తి తిరుపతి రావు, బిజెపి పట్టణ యువమోర్చా అధ్యక్షులు రామిశెట్టి గోపి ప్రధాన కార్యదర్శి త్రికేష్, మున్సిపల్ కౌన్సిలర్లు కాటగని నరసింహారావు, పేరం సైదేశ్వరావు, రామలక్ష్మి, ఈ.నరసింహారావు సంగేపు బుజ్జి, కర్ల జోజి, గొట్టే నాగరాజు, నకిరికంటి వెంకట్. జగ్గయ్యపేట రూరల్ మండలం సోషల్ మీడియా కన్వీనర్ పగిడిపర్తి వినోద్ ప్రముఖ న్యాయవాది శ్రావణ్, హిందూ చైతన్య వేదిక పట్టణ అధ్యక్షులు సంక భాస్కర్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రముఖులు ఎంవీఎస్ సాయి కంబాల గోపి, సమరసిత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు వీరబాబు, సాప్ కోచ్ కీసర గోపి తదితరులు పాల్గొన్నారు..

## పేద రోగులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత



**గన్నవరం, ఆగస్టు 13, మేజర్ న్యూస్ :** పేద రోగులకు మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి పథకం ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫార్సు మేరకు గన్నవరం గ్రామానికి చెందిన చిలుకూరి విజయ స్వప్న కు రూ. 3లక్షలు, బుద్దవరం గ్రామానికి చెందిన పోతునూరు వెంకట రంగారావుకు రూ. 2.94లక్షలు, గొల్లనపల్లి గ్రామానికి చెందిన రితికా రెడ్డి కి రూ. 1.72 లక్షలు చొప్పున మొత్తం 109 మంది రోగులకు వైద్యచికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుండి రూ.62.48 లక్షల చెక్కులు, ఎల్ఓసిలు మంజూరు కాగా మంగళవారం రాత్రి రోగుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా అందచేశారు. మంగళవారం రాత్రి గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యార్లగడ్డ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం ఖరీదుగా మారిన ప్రస్తుత తరుణంలో రోగులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలోని రోగులకు పెద్ద ఎత్తున సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయిస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎల్ఓసి లను ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గన్నవరం, బాపులపాడు, విజయవాడరూరల్ మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తుల సి మోహన్, దయల రాజేశ్వరావు, గొడ్డళ్ల చిన్న రామారావు, గన్నవరం ఏఎం సి ఉపాధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణ, వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపై వైసిపి నిరాధార ఆరోపణలు

### టిడిపి మండల నాయకులు వెల్లడి

**పెదన మేజర్ న్యూస్ :** రైతులకు సాగునీరు అందించే విషయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కృషి ఎనలేనిదని అటువంటి వ్యక్తిపై వైసిపి నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సెలపాటి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు టిడిపి పార్టీ కార్యాలయములో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుమల్లి గ్రామంలో వైసీపీ నాయకులు అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని అన్ని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గుడ్లవల్లేరు కెనాల్ నుండి ప్రతిరోజు 230 క్యూసెక్కుల సాగునీటిని రైతులకు అందిస్తున్నారని దీనిపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి కారణంగా రైతు ఎక్కడైనా ఇబ్బంది పడితే తమ పార్టీ బాధ్యత వహిస్తుందని స్పష్టం చేశారు. అలాగే మండల లో గల పిఏసిఎస్‌లో యూరియా కొరత కారణంగా ఎరువుల సమస్య ఎదురవుతున్న రైతులకు సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే వ్యవసాయ సాయి అధికారులకు సూచించారని ఈ విషయం కూడా అవగాహన లేకుండా వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారని ఎద్దేవ చేశారు. నియోజవర్గం మొత్తం మీద ఎకరం భూమి కూడా నీరు లేకుండా లేదని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి అర్జ నగేష్ టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాదు తదితరులు ఉన్నారు.

## యూరియా సరఫరాలో వివక్ష చూపితే సహించను



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఆగస్టు 13:** రైతాంగ ప్రయోజనాలే నాకు ముఖ్యమని, యూరియా కొరత తలెత్తితే సహించే ప్రసక్తి లేదని ఎంఎల్ఏ వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రజావేదికలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంఎల్ఏ రాము నియోజకవర్గ రైతాంగ నిష్పత్తికి సరిపడా యూరియా ఎందుకు సరఫరా కావడంలేదని అధికారులను ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు. వ్యవసాయ జెడితో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే రాము యూరియా కొరత రాకుండా సరఫరా చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతాంగ ప్రయోజనాలను కాపాడాలని ఎమ్మెల్యే రాము సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ రైతాంగంపై చిన్నచూపు చూస్తే సహించే ప్రసక్తి లేదన్నారు. రైతాంగ అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా కావాల్సిందేనని, రైతాంగ అవసరాల కంటే తక్కువగా యూరియా పంపితే సహించేది లేదని ఎమ్మెల్యే రాము చెప్పారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ కవిత, ఏవోలుబి.అనంతలక్ష్మి, సునీల్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ పార్టీల వల్లే రాష్ట్రం సర్వనాశనం అవుతుంది



**పెడన,మేజర్ న్యూస్:** వైసిపి టిడిపి ప్రాంతీయ పార్టీల వల్ల రాష్ట్రం సర్వనాశనం అవుతుందని జీరో డోర్ నెంబర్లతో దొంగ ఓట్లతో అధికారాల్లోకి వచ్చిన ప్రాంతీయ పార్టీల వల్ల రాష్ట్ర ప్రజల పూర్తిగా నష్టపోతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి చైర్మన్ సొంటి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన పార్టీ కార్యాలయములో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొంటి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఆదుకుంటానని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు కనీసం ఒక యూరియా బస్తా కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కూటమి ప్రభుత్వ పార్టీకి చెందిన కార్యకర్తలకు మాత్రమే యూరియా బస్తాలు అందుతున్నాయని దీనిపై అవసరమైతే ఉద్యమానికి కూడా సిద్ధమని హెచ్చరించారు.ఇక వైసిపి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అయితే తాడేపల్లి ప్యాలెస్ నుండి బయటకు రాకుండా రాహుల్ గాంధీని విమర్శించే పనులు చేయడమే తప్ప ఆయనకి ఇంకేమీ పనిలేదని అన్నారు. దొంగ ఓట్ల విషయంలో రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయట పెడుతుంటే జగన్మోహన్ రెడ్డికి నొప్పి కలిగి ఇప్పుడు బయటకు వచ్చి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావే శంలో రాహుల్ గాంధీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్లో కూడా సుమారు 50 లక్షల ఓట్లు దొంగ ఓట్లు జరిగాయని రాహుల్ గాంధీ ఆధారాలతో బయటపడుతుంటే దాన్ని వదిలేసి జగన్మోహన్ రెడ్డి టిడిపి పార్టీతో కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీల వల్లే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని ఇటీవల జరుగుతున్న బై ఎలక్షన్లలో జరుగుతున్న గొడవలు చూస్తుంటే వాళ్లు అధికారంలోకి రావడానికి ఎంతకైనా తెగిస్తారు అన్న దానికి నిదర్శనంగా కనబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## పాములపాడు పిఎసిఎస్ చైర్మన్‌గా వెంకటకృష్ణ

**పెదపారుపూడి ఆగస్టు 13 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాములపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంకు త్రీ మెన్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. స్థానిక శాసనస భ్యులు వర్ల కుమార్ రాజా సూచనల మేరకు చైర్మన్ గా కాటూరి నాగ వెంకటకృష్ణ, సభ్యులుగా చిలుకూరి శివశంకరరావు, దూళ్ళ శంకరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ తన నియామకానికి తన నియామకానికి సూచనలు అందించిన ఎమ్మెల్యే కుమార్ రాజాకు మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి ప్రధాన కార్యదర్శి బస్సు ముక్కు మసి ముక్కు రాంబాబు లకు కృతజ్ఞతలు తెలిపారు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో వారికి తమ సొంగరం ద్వారా తమ సంఘం ద్వారా సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి కావూరి వేణు, జిన్నా, గుమ్మడి కృష్ణారావు, సజ్జా శివయ్య, గుండపనేని శ్రీనివాసరావు, దుగ్గిరాల బాల నరేష్ తదితరులు శుభాకాంక్షలు అందించి అభినందనలు తెలిపారు.

## గన్నవరంను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి



**గన్నవరం, ఆగస్టు 13, మేజర్ న్యూస్ :** విజయవాడకు సమీపంలో ఉన్న గన్నవరంను కృష్ణాజిల్లా నుంచి వేరుచేసి ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్ లోని రైతు శిక్షణ కేంద్రంలో జరిగిన జిల్లా సమీక్ష మండలి సమావేశానికి హాజరైన ఇన్చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ జిల్లాల పునర్విభజన పేర్లు, సరిహద్దుల మార్పు కోసం ఏర్పాటు చేసిన శాసనసభ ఉప కమిటీ లో సభ్యులుగా ఉన్నందున ఈమేరకు సత్యకుమార్ కు యార్లగడ్డ వినతి పత్రాన్నిటి అందచేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన జరిగిన సమయంలో భోగోళికంగా విజయవాడ ను ఆనుకొని ఉన్న గన్నవరం మండలాన్ని మచిలీ పట్నం కేంద్రంగా ఉన్న కృష్ణాజిల్లాలో కలపటం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లేం దుకు ప్రజలకి ఇబ్బందికరంగా మారిందన్నారు. జిల్లాల పునర్విభజనలో జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం పూనుకున్నందున, విజయవాడ పేరుతో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న గన్నవరం మండలాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, ఉంగుటూరు, బాపులపాడు మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ఆయన కోరారు. అదేవిధంగా విజయవాడలో ఉన్న విజయవాడ రూరల్ మండలాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం చేయాలని సూచించారు. ఎన్టీఆర్ పుట్టిన నిమ్మకూరు కృష్ణాజిల్లాలో ఉందని కానీ విజయవాడకు ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ జిల్లా గాను ఎన్టీఆర్ జిల్లాను కృష్ణాజిల్లా గాను ఈ రెండు జిల్లాల పేర్లు మార్పు చేయాలని యార్లగడ్డ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా సమీక్షా మండలి సమావేశాలకు డిసిసి బ్యాంక్ చైర్మన్లను ఆహ్వానించాలని తద్వారా సహకార సంఘాల్లో రైతుల ఇబ్బందులను చర్చించేందుకు వీలుంటుందని యార్లగడ్డ పేర్కొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**ఏ కొండూరు, మేజర్ న్యూస్:** ఏ. కొండూరు మండలం చీమలపాడు పెద్దతండ గ్రామం లో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి మెయిన్ రోడ్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షులు గుడిపూడి నామలేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జిలుగా నియమించబడ్డ బాణావత్ గాంధీ, సొంటియాల నాగ సురేంద్రనాథ్ ముఖ్య అతిథులుగా ఎస్సీ మోర్చా స్టేట్ జోనల్ ఇన్చార్జ్ తేనేటి ఇమ్మానియేల్ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు జరపల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేయ డంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో పాఠశాల విద్య నిర్మాణ అంశాలుపై మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒక రోజు జిల్లా స్థాయి కార్యశాల కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ దార్శనికత 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్య మెరుగుదలకు విద్యాధికారులందరూ కృషి చేయాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సబ్జెక్టుపై పట్టు సాధించే విధంగా నాణ్యమైన విద్య, అవసరమైన నైపుణ్యాలు అందించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం చాలా ముఖ్యమని పేర్కొంటూ, ఆ దశలో వారికి వేయాల్సిన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను అందించాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో విధిగా ప్రథమ చికిత్స కిట్టును ఉంచాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, నైతిక విలువలు నేర్పిస్తూ మాదకద్రవ్యాలు జోలికి పోకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యశాలలో డీఈవో పీవీజే రామారావు, జెడ్పి డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాల్లో పుట్టారు పాలిటెక్నిక్ స్టేట్ టాపర్స్‌గా నిలిచారు








గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఆగస్టు 13 : ఆ విద్యార్థులు పేద కుటుంబాల్లో పుట్టి పాలిటెక్నిక్‌లో స్టేట్ టాపర్స్‌గా నిలిచారు ఈ ఇరు ఆణిముత్యాలు. గుడ్లవల్లేరులో 17వ వార్షిక వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు స్మారక అవార్డుల ప్రదానోత్సవం బుధవారం జరిగింది. ఏపీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్టేట్ టాపర్ గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థి ఆలూరి లలితా కోమలి(99.52%), స్టేట్ సెకండ్ టాపర్ నందమూరు వాసవీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థి అంకెం అఖిలాదేవి(98.95%)లకు శేషాద్రి రావు స్మారక అవార్డులను ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా సంస్థ కార్యదర్శి జి.వి.వి. సత్యనారాయణమూర్తి విజేతలకు అందించారు. అన్ని బ్రాంచీల విద్యార్థుల్లో ఓవరాల్ స్టేట్ టాపర్, సెకండ్ టాపర్ ర్యాంకులను ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల్లో స్టేట్ ఫస్ట్, సెకండ్ టాపర్లుగా విజయం సాధించిన వీరి మనోగతాలు జూనియర్స్‌కు సందేశాన్ని ఇచ్చాయి. ఈ విజేతలు వారి కుటుంబాలతో కలిసి తమ మనోగతాన్ని పంచుకున్నారు.

**ఐఏఎస్ చిన్ననాటి డ్రీమ్ :- ఆలూరి లలితా కోమలి, పాలిటెక్నిక్ స్టేట్ టాపర్**

చిన్ననాటి నుంచే ఐఏఎస్ చేయాలనే డ్రీమ్ ఉంది. మాది పల్నాడు జిల్లా ఎడ్లపాడు సొలస గ్రామం. మా నాన్న తాపీ మేస్త్రి. టెక్నికల్ స్కిల్ కోసం బీటెక్‌ను నరసరావు పేట జేఎన్‌టీయూలో చేస్తున్నా. సివిల్స్ అయ్యాక తన వంటి ప్రతిభావంతులైన పేద పిల్లల్ని తన వలె ఉన్నత చదివించేందుకు కషి చేయాలనేది నా ధ్యేయం. మా కాలేజీ ప్రోత్సాహంతో స్టేట్ టాపర్‌గా నిలిచాను.

**మా నాన్న సామాన్య రైతు :**

**అంకెం అఖిలాదేవి, పాలిటెక్నిక్ స్టేట్ సెకండ్ టాపర్**

మా నాన్న సామాన్య రైతు. మాది మచిలీపట్నం. నాకు చదువు మీదున్న ఉత్సాహం చూసి, తనకు ఎన్ని కష్టాలున్నా విద్యను చెప్పించేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. ఎక్కడా రాజీ పడకుండా వ్యవసాయం మీదే నన్ను చదివించారు. వారి ప్రోత్సాహమే రాష్ట్ర స్థాయిలో ఈ స్థాయిలో నిలిచేందుకు దోహదపడింది. ఉన్నత శిఖరాలను చేరుకుని తనవంటి పేదలకు న్యాయం చేస్తా.

**ఉత్తమ విద్యార్థులకు : వల్లూరుపల్లి సత్యనారాయణరావు(బాబ్జి), కాలేజీ సెక్రటరీ**

సాంకేతిక విద్యలో ఉత్తమ విద్యార్థులను తీర్చి దిద్దేందుకు ఈ స్టేట్ లెవల్ అవార్డులను శేషాద్రిరావు పేరిట 17ఏళ్లగా అందిస్తున్నాం. మా ప్రయత్నం ఫలించి ఎంతోమంది పేద విద్యార్థులు తమ ప్రజ్ఞా పాటవాలను కనబరిచిన విజేతలుగా నిలుస్తున్నారు. ఏటా మా నాన్న పేరిట స్టేట్ అవార్డులు ఇవ్వటం చాలా గర్వకారణంగా ఉంది.

**ఆరోగ్యకర పోటీతత్వం : వల్లూరుపల్లి రామకష్ణ, కాలేజీ కో-కరస్పాడెంట్**

రాష్ట్ర స్థాయిలో టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి నాన్న పేరిట అవార్డులు ఇవ్వటం ఆరోగ్యకర పోటీతత్వం విద్యార్థుల్లో ఏర్పడుతుంది. మా ప్రాంతంలో విద్యార్థులు కూడా ఆ అవార్డులు పొందటం గర్వకారణంగా ఉంది. 2009నుంచే ఈ అవార్డులను స్వర్గీయ వల్లూరుపల్లి శేషాద్రిరావు పేరిట ఇస్తున్నాం.

# వరద సంబంధిత ఫిర్యాదుల కొరకు ప్రత్యేక కంట్రోల్

**రూమ్ 24 x7 అందుబాటులో ఉంచండి**

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ, మేజర్ న్యూస్ :** వరద హెచ్చరికల కారణంగా విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ను 24 గంటలు అందుబాటులో ఉంచుతున్న ట్టు ప్రజలు తమ ఫిర్యాదులను అందచేయవచ్చని, లోతట్టు ప్రాంత ప్రజలు వెంటనే సురక్షితమైన ప్రాంతాలకు తరలిరావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం నాడు సితార సెంటర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లేబర్ కాలనీలో నివసిస్తున్న ప్రజల ఇంట్లోకి నీరు రావడం గమనించి, వారికి ముందుగా వెంటనే ఇంటి వద్దనే ఆహారం అందించేటట్టు ఏర్పాటు చేయాలని, పునరావస కేంద్రాలకు తరలించాలని, వరద నీరును తీసేసే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరద హెచ్చరిక సంబంధించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతిక్షణం అప్రమత్తంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, లోతట్టు ప్రాం తాల్లో ఉన్న ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. వరదల సంబంధించి ప్రజలు ఎటువంటి సాయం కావాలన్నా, ఫిర్యాదులు ఉన్న 8181960909 నంబర్కు వాట్సఅప్ ద్వారా తెలుపవచ్చని, 0866-2427485, 0866-2424172, 0866 2427485? నంబర్లకు కాల్ చేయవచ్చని, సిబ్బంది మూడు షిఫ్ట్ లలో 24 గంటలు అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు.

## లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

**విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం నాడు ప్రధాన కార్యాలయంలో తమ చాంబర్లో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కృష్ణానది బుడమేరు పరివాహక ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, నగరం లోని వరద ముంపు ప్రాంతాలలో నివసిస్తున్న వారి దగ్గరలోని పునరావాస కేంద్రాలకు చేర్చాలని, పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి అన్ని వసతులు కల్పించాలని మేయర్ అన్నారు. పడుతున్న వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి భయభ్రాంతులకు గురి అవ్వకుండా ఉండాలని, వరదల గురించి ఎటువంటి వదంతులు నమ్మవద్దని, విజయవాడ నగర పాలక సంస్థ ఎల్లప్పుడు ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు.

## పంటపొలాల పరిరక్షణ చర్యలు చేపట్టండి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాల పరిరక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్యే మండల ప్రసాద్ బుధవారం ప్రకటనలో కోరారు. డ్రైనేజీ శాఖ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు ముంపునకు గురైన ప్రాంతాలలో పర్యటించి పంట పొలాల పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం రాత్రి నియోజకవర్గంలో భారీ వర్షం కురిసిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామాలలో నిలిచి ఉన్న నీటిని తొలగించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆదేశించారు.

## రైతులకు మెరుగైన సేవలాందిస్తాం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మాజేరు సొసైటీ చైర్మన్‌గా తిరుమల శెట్టి బాల నాగేశ్వరరావు, సభ్యులుగా తిరుమల శెట్టి నాగ రాజశేఖర్, యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తనమీద నమ్మకంతో చైర్మన్ గా నియమించిన స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ద ప్రసాద్, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సహకార సంఘ పరిధి లోని రైతుల శ్రేయస్సుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు చేరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని బాల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. సొసైటీ కార్యకలాపాలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి, రైతులకు మరింత సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, సంఘ సభ్యులు, సిబ్బంది రైతులు, అభినందించారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ సి ఈ వో ఎస్ ఎస్ చక్రపాణి పాల్గొన్నారు.


**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999